క్లుప్తంగా

సూర్యక్షేత్రం సందర్శన



సూర్యక్షేత్రాన్ని సందర్శించిన ఉపాధ్యాయులు

అర్వపల్లి : విద్యా సంస్థలకు వరుసగా రెండు రోజులు సెలవులు రావడంతో తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని వివిధ ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు సందర్శిస్తున్నారు. గురువారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం, సూర్యాపేట జిల్లా తిరుమలగిరి తదితర మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు సందర్శించి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా క్షేత్ర విశిష్టతను సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జానయ్య, వీరన్న, ఉమాదేవి, మంగతాయమ్మ, ఝాన్సి, నళిని, సూర్యక్షేత్ర అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాల శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీకి చేరిన రెండో విడత పాఠ్యపుస్తకాలు

అర్వపల్లి : ఎమ్మార్సీకి గురువారం రెండో విడత పాఠ్యపుస్తకాలు చేరాయి. మండలానికి 20వేల పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా మొదటి విడతలో 10వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయి. రెండో విడతలో 2,203 పుస్తకాలను జిల్లా నుంచి పంపారు. అలాగే మరికొన్ని నోట్ పుస్తకాలు కూడా వచ్చాయని ఎంఈఓ బాలునాయక్ తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలకు ఈ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట రూరల్ : మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున సూర్యాపేట మండల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ బీరవోలు రవీందర్ రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలకు, ట్రాన్స్‌ఫార్మర్‌లకు చుట్టు పక్కల నివసిస్తున్న వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న వాణి శ్రీకాంత్‌రాజు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన ఆరాధ్య ఫౌండేషన్ సభ్యుడు అంకిరెడ్డి ఆంజనేయులు ఆటో డ్రైవర్ కావడంతో ఆయనకు ఆటో కొనుగోలు కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేశారు. గురువారం ఆంజనేయులుకు ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణి–శ్రీకాంత్ రాజు దంపతులు రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి బైరబోయిన సైదులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆకారపు సుదర్శన్‌కు నివాళి



ఆకారపు సుదర్శన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : మాజీ రాజ్యసభ సభ్యుడు ఆకారపు సుదర్శన్ సేవలు మరువలేనివని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దారోజు జానకిరాములు, టీడీపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకారపు రమేష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆకారపు సుదర్శన్ 13వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మునీర్‌ఖాన్, సుధాకర్, నాగయ్య, వినోద్ పాల్గొన్నారు.

మద్దెల నాగేశ్వరరావు మృతి తీరనిలోటు

దురాజ్‌పల్లి : సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు మద్దెల జ్యోతి మామ మద్దెల నాగేశ్వరరావు అకాల మరణం బాధాకరమని, ఆయన మృతి తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. గురువారం సూర్యాపేటలో మద్దెల నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యుడు ఎల్గూరి గోవింద్, జిల్లపల్లి నరసింహారావు, మేకనబోయిన శేఖర్, వీరబోయిన రవి పాల్గొన్నారు.

సీపీఐలో చేరిన బీఆర్‌ఎస్ వార్డు సభ్యుడు

తిరుమలగిరి : తొండ గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యుడు ఎల్లంల కొమురెల్లి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి గురువారం సీపీఐలో చేరారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లంల యాదగిరి, కంబాల శ్రీనివాస్, ఎండీ.ఎక్బాల్, ఫయాజ్, అశోక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రధాన రహదారి

- గుంతలతో అధ్వానంగా మారిన వలిగొండ–తొర్రూరు రహదారి
- కనీస మరమ్మతులకు నోచుకోక చోటుచేసుకుంటున్న ప్రమాదాలు



వెలిశాల ఎక్స్‌రోడ్డు వద్ద రహదారిపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత

తిరుమలగిరి : వలిగొండ–తొర్రూరు ప్రధాన రహదారి గుంతలమయంగా మారి వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి అనంతారం, తిరుమలగిరి, తొండ, వెలిశాల, జలాల్‌పురం ఎక్స్ రోడ్డు, మామిడాల గ్రామాల గుండా వెళ్తూ తిరుమలగిరి మండల పరిధిలో సుమారు 20కి.మీ. వరకు ఉంటుంది. ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలు కూడా ఈ రోడ్డుపై నుంచే హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్తున్నాయి. కానీ పలుచోట్ల ఈ రహదారిపై భారీ గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.549 కోట్లతో విస్తరణ పనులు..

ఓఆర్‌ఆర్ (గౌరెల్లి) నుంచి కొత్తగూడెం వరకు కేంద్ర ప్రభుత్వం భారత్ మాల ప్రాజెక్టులో భాగంగా రెండు వరుసల రహదారి (930పీ) వేయడానికి టెండర్లు పిలిచింది. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. రెండు వరుసల రహదారి పనులు పూర్తి కావాలంటే ఆరు నెలల నుంచి సంవత్సరం వరకు పట్టవచ్చు. కానీ అప్పటివరకు గుంతలమయంగా ఉండే రహదారిపై ప్రయాణించడానికి ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు. అసలే వర్షాకాలం కావడంతో రోడ్డుపై నీళ్లు నిలిచి గుంతలు కనిపించడం లేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు ఈ గుంతల్లో పడుతున్నారు. ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వెలిశాల ఎక్స్‌రోడ్డు, తిరుమలగిరి మున్సిపాలిటీ, తొండ గ్రామాల మధ్య పెద్ద పెద్ద గుంతలు ఉండటంతో ఈ మధ్య కాలంలో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. దీనికి తోడు భారీ లోడ్‌లతో వస్తున్న వాహనాలు సైతం ఈ గుంతల్లో ఆగిపోతున్నాయి. రహదారి విస్తరణ పనులు పూర్తవడానికి ఇంకా చాలా నెలలు పట్టనున్నందున అప్పటివరకు రోడ్డుపై చిన్న చిన్న మరమ్మతులు చేయించాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



వలిగొండ–తొర్రూరు రోడ్డుపై అడుగడుగునా గుంతలే ఉన్నాయి. వర్షా కాలం కాబట్టి గుంతల్లో నీళ్లు నిలిచి ఉంటున్నాయి. ప్రతిరోజు ఏదో ఒక చోట గుంతల్లో పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు.

– యాకయ్య, వెలిశాల ఎక్స్‌రోడ్డు

ఇబ్బందులు పడుతున్నారు

తొర్రూరు రోడ్డు వైపు ఉన్న గుంతలో ఈ మధ్య కాలంలో ఐదారుగురు పడ్డారు. ఈ రహదారిపై ప్రతిరోజూ ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. అధికారులు పట్టించుకొని ఈ గుంతలను పూడ్చాలి.

– వెంకన్న, తిరుమలగిరి

బాధితులకు మంత్రి పరామర్శ

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండల పరిధిలోని దూపహాడ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు దొంగరి బజారయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. దీంతో గురువారం మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా ఎంపీపీ నెమ్మాది భిక్షం ఇటీవల కాలుకు శస్త్రచికిత్స చేయించుకొని చికిత్స పొందుతుండటంతో అతడిని కూడా పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌లు వెన్న సీతారాంరెడ్డి, నాతాల జానకిరాంరెడ్డి, వై.వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ జీడి భిక్షం, సర్పంచ్ బిట్టు నాగేశ్వర్‌రావు, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, గుగ్గిళ్ల సోమయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మృతుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి



ఎంపీపీ భిక్షంను పరామర్శిస్తున్న మంత్రి

కలెక్టరేట్ వద్ద మినీ గురుకుల ఉపాధ్యాయుల ధర్నా



ధర్నా చేస్తున్న మినీ గురుకుల ఉపాధ్యాయులు

చివ్వెంల : మండల కేంద్రంలోని ఎస్టీ మినీ గురుకుల బాలికల పాఠశాల ఉపాధ్యాయులు గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మినీ గురుకులంలో ఉపాధ్యాయులను పర్మనెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం, బోధన సిబ్బందికి రూ.31 వేలు, బోధనేతర సిబ్బందికి రూ.22 వేలు, అకౌంటెంట్‌కు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళలకు 180 రోజులు ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాకు యూటీఎఫ్ ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్. లక్ష్మి, పద్మ, ప్రతిభ, ఉమ, శ్రీలత, శ్రీనివాస్, సుజాత పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనపై అవగాహన



నూతనకల్ : మాట్లాడుతున్న ఆర్డీఓ

పెన్‌పహాడ్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనపై బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శేషగిరిరావు మాట్లాడారు. 1 అక్టోబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు పద్మ, లాలు, ఎలక్షన్ డీటీ కంట్లమయ్య, ఆర్‌ఐలు స్వప్న, మట్టయ్య, బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అర్వపల్లి : బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఓటరు జాబితాను సరిచూసుకోవాలని తహసీల్దార్ పి.యాదగిరిరెడ్డి కోరారు. గురువారం అర్వపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓటు నమోదు సవరణలో సరైన సూచనల మేరకు మార్పులు, చేర్పులు చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి కచ్చితంగా తొలగించాలని ఆదేశించారు. ఎన్నికలు దగ్గర పడుతున్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలంధర్‌రావు, ఆర్‌ఐ కరుణాకర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

నూతనకల్ : అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి సమగ్ర ఓటరు జాబితా తయారీకి కృషి చేయాలని ఆర్డీఓ రాజేంద్రకుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనపై బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 1 అక్టోబర్ 2023 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సవరించాలని, మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లను తొలగించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ జమీరుద్దీన్, బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్



పెన్‌పహాడ్‌లో బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు

వైద్యరంగానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం



మద్దిరాలలో పల్లె దవాఖాన పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



తిరుమలగిరిలో ఇన్సూరెన్స్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

మద్దిరాల : వైద్యరంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంతోపాటు రెడ్డిగూడెం గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టిన పల్లె దవాఖానల నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. నిరుపేద కుటుంబాలకు వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఈ పల్లె దవాఖాలను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు స్వప్న, బ్రహ్మాచారి, నాయకులు అప్పిరెడ్డి, సురేష్‌రెడ్డిలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్, బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ శోభన్‌బాబు, ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురాంబ వీరన్నగౌడ్, వైద్య అధికారులు హర్షవర్ధన్, అశ్రీతరెడ్డి, నాగునాయక్, తహసీల్దార్ అమీన్‌సింగ్, వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, గ్రంథాయ కమిటీ జిల్లా డైరెక్టర్ దుగ్యాల రవీందర్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, సూరినేని నర్సింహారావు, నల్లాని శ్రీనివాస్‌రావు, సర్పంచ్‌లు బర్పటి ఉపేందర్, ఇంతియాజ్‌ఖాతూన్ రజాక్, ఎంపీటీసీ నాగెల్లి శ్రీలత శ్రవణ్‌కుమార్, మల్లు కొలింగారెడ్డి, వడ్డాణం మధుసూదన్, పాలబిందెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వెలుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో మన ఊరు–మనబడి పథకం కింద రూ.22లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, నోట్‌పుస్తకాలు అందుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అశోక్, తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ భీంసింగ్, ఎంఈఓ బోయిని లింగయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, నల్లు రామచంద్రారెడ్డి, సర్పంచ్ మామిడి వెంకన్న, ఎంపీటీసీ మట్టపల్లి కవిత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తుంగతుర్తి : వెలుగుపల్లిలోని పాఠశాలలో పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

కార్యకర్తలకు అండగా బీఆర్‌ఎస్

నాగారం : కార్యకర్తలకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ అన్నారు. డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గైగుళ్ల నర్సయ్య ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మృతుడు బీఆర్‌ఎస్ పార్టీ క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండటంతో అతడికి పార్టీ నుంచి మంజూరైన రూ.2,00,000 ఇన్సూరెన్స్ చెక్కును గురువారం తిరుమలగిరిలోని తన నివాసంలో బాధిత కుటుంబానికి అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, ఎంపీపీ కూరం మణి వెంకన్న, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు యారాల నర్సింహారెడ్డి, దోమల బాలమల్లు, అశోక్, తీగుళ్ల యాదగిరి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె

చివ్వెంల : తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని గత కొద్ది రోజులుగా పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాగర్, భిక్షం, కృష్ణ, మురళీ, శంకర్, రవి, రాణి, రాంబాబు, నాగశ్రీను, ఉప్పలయ్య, పూలమ్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలో తడుస్తూ నిరసన

అర్వపల్లి : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం అర్వపల్లిలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు వర్షంలో తడుస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికుల సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు జీడి కృష్ణ, కన్నెబోయిన శ్రీశైలం, గుగులోతు నాగులునాయక్, చెరుకు శంకర్, యాకూబ్, ప్రవీణ్, బాషమియా, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంలలో సమ్మెలో పాల్గొన్న జీపీ కార్మికులు

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట రహదారిపై గ్రామ పంచాయతీ కార్మికులు వానలో నిరసన వ్యక్తం చేయగా వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రణపంగ వెంకన్న, నకిరేకంటి నర్సయ్య, ఎల్లమ్మ, మట్టయ్య, రవి, ఏడుకొండలు, శ్రీను, రమణయ్య, నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లిలో..



పెన్‌పహాడ్ : రహదారిపై వానలో తడుస్తూ నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

దురాజ్‌పల్లి : డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలన కోసం బాటసింగారం వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని రాష్ట్ర పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సూర్యాపేట అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, జిల్లా నాయకుడు ధనుంజయ్‌గౌడ్ మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పరిశీలన కోసం బాటసింగారం వెళ్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని రాష్ట్ర పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల రాజ్యాంగం అమలవుతుందని అన్నారు.



సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కేంద్ర మంత్రికి సెక్యూరిటీ కల్పించాల్సిన పోలీసులే అడ్డుకోవడం అనేది దేశ చరిత్రలో ఇదే మొదటిసారి కావొచ్చని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి పేదవాడికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వచ్చేంత వరకు ప్రజల పక్షాన బీజేపీ ఉద్యమిస్తుందని తెలిపారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

చివ్వెంల : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్‌లోని బాటసింగారంలో డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలనకు వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పేరాల లక్ష్మణ్‌రావు, ధరావతు శ్రీనివాస్ నాయక్, కొణతం అప్పిరెడ్డి, ధరావతు జాను నాయక్, జంపాల వెంకటేశ్వర్లు, బిట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు బాటసింగారంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిశీలనకు వెళ్లకుండా గురువారం స్థానిక పోలీసులు బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వై.ధీన్‌దయాళ్ మాట్లాడారు. పోలీసులు అక్రమంగా అరెస్టులు చేయడం తగదన్నారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి మేడబోయిన యాదగిరి, వేల్పుల బంగారు స్వామి, ఎం.వెంకట్‌రెడ్డి, సోమయ్య ఉన్నారు.

తుంగతుర్తి : బీజేపీ పిలుపు మేరకు చలో బాటసింగారం కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం హేయమైన చర్యని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని.. లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు పులిపంపుల సైదులు, పాడేటి రావన్, ఉప్పుల వెంకన్న, సందీప్, గుండాల మహేష్ తదితరులు ఉన్నారు.

మద్దిరాల : బాటసింగారంలోని డబుల్‌బెడ్ రూం ఇళ్ల పరిశీలనకు వెళ్లేందుకు బీజేపీ పిలుపునివ్వడంతో గురువారం పోలీసులు ముందస్తుగా పలువురు బీజేపీ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్ మాట్లాడారు. బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొమ్మెర వెంకన్న, బీసు పెద్ద వీరన్న, చామకూరి లింగయ్య, బీసు చిన్న వీరన్న, మర్రి చిన్న ఉప్పలయ్య, విక్రమాచారి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంలలో అరెస్టయిన బీజేపీ నాయకులు

పెన్‌పహాడ్ : బాటసింగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించడానికి వెళ్తున్న మండల బీజేపీ నాయకులను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో రాపర్తి వెంకన్న, రంగినేని విజయ్‌కుమార్, చామకూరి వెంకటేష్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

నాగారం : బాటసింగారంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిశీలన కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ నాయకులకు పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని, ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. అరెస్టయిన వారిలో బీజేపీ నాయకులు ఆలకుంట్ల బాలకృష్ణ, అనంతుల సోమేష్, నాగు వెంకన్న, మంగదుడ్ల రమేష్, బొబ్బలి కిరణ్, సోమయ్య, యాకూబ్, సోమశేఖర్, నరేష్ తదితరులు ఉన్నారు.

నూతనకల్ : బాటసింగారంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించడానికి వెళ్తున్న మండల బీజేపీ నాయకులను పోలీసులు గురువారం ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్, మారగాని ముత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రెండు రోజులుగా ఆగని ముసురు



జలమయమైన అర్వపల్లిలోని ఆలయ ఆవరణ

సూర్యాపేట రూరల్ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండాయి. పిన్నాయిపాలెం, పిల్లలమర్రి, దాసాయిగూడెం, ఇమాంపేట, కేటీ అన్నారం, కాసరబాద గ్రామాల్లోని చెరువులు, కుంటలు మూసీ కాలువల నీళ్లు, వర్షాలు రావడంతో నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు మెట్ట పంటలు వేసిన రైతులకు ఊరటనిచ్చాయి.

అర్వపల్లి : ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనజీవనం స్తంభించింది. గురువారం రోజంతా పడిన వర్షానికి మండల వ్యాప్తంగా గ్రామాల్లో వీధులు చిత్తడిగా మారాయి. అలాగే అర్వపల్లిలోని ఎమ్మార్సీ భవనం, శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయం, కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్, సంత ఆవరణ జలమయమయ్యాయి.

తిరుమలగిరి : మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలంతా ఇళ్లలోనే ఉన్నారు. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హరితహారం, సీజనల్ వ్యాధులపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో గురువారం వేల్పుచెర్ల గ్రామంలో ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఖమ్మంపాటి కరుణాకర్, కళాకారులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పాక ఉపేందర్, పల్లెల రాము, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష, ప్రియాంక, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రైతుల సంక్షేమానికి అనేక పథకాలు

కోదాడరూరల్ : సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని అందుకే వారి అభివృద్ధి, సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కాపుగల్లు రైతు వేదికలో రైతులతో నిర్వహించిన రైతుయుద్ధ వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల బాధలు తెలిసిన వ్యక్తి రాష్ట్రానికి సీఎంగా ఉన్నందునే ఏ రైతు ఇబ్బంది పడొద్దని పెట్టుబడి సాయం కింద రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్ అందిస్తున్నారని అన్నారు. పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అండగా నిలుస్తున్నారన్నారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్ట్‌లతో బీడు భూములు సాగులోకొచ్చి సస్యశ్యామలం అయ్యాయని తెలిపారు. గత పాలకుల హయాంలో రైతులు ఎన్ని ఇబ్బందులు పడ్డారో అందరికీ తెలుసన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా నాణ్యమైన 24 గంటల విద్యుత్ ఇస్తుంటే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి 3 గంటలు ఇస్తామని రైతులను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, సర్పంచ్, పార్టీ మండల అధ్యక్షుడు కాసాని వెంకటేశ్వర్లు, పొట్టా కిరణ్, అనంతు సైదయ్య, గంటా శ్రీనివాస్, పాపారావు, నాగేశ్వరరావు, మాధవరావు, అనంతరామయ్య పాల్గొన్నారు.